# అవినీతి పిశాచాన్ని వదిలించడం ఎలా?



మానవుడికి ఆపదలు రాకుండా రక్షించే శక్తి ఏమిటి? ఆ శక్తి పేరు వివేకము. మనుష్యుల జీవితంలో చెడ్డరోజులు వచ్చినప్పుడు మొదటగా వివేకం పోతుంది. ఇది ఎంతవాడికైనా సిద్ధాంతమే. బంగారు లేడిని చూసిన సీతకు, అట్లాంటి జంతువు ఉండడము ప్రకృతి విరుద్ధమని, అది అనుమానించదగినదని తోచలేదు. అది నిజమని నమ్మడం, అది కావాలని కోరుకోవడము- అదే వివేకభ్రష్టత్వము. అక్కడ క్షణాల్లో ఆపద పొంచి ఉన్నది.

మనుష్యుడు స్వస్థతతో ఇంటి నీడన కాలం గడుపుతున్న కాలంలో ఉన్నట్లుండి బుద్ధిలో వికారం ఒకటి ఏర్పడుతుంది. అది సముచితంగా, లోక సామాన్యంగా ధర్మబద్ధంగా ఉండదు. ఆ లక్షణంతో బుద్ధినుంచి పుట్టిన కథ త్వరగా పెరుగుతుంది. ఆ వ్యక్తి ఆపదలపాలు కావలసిందే! ఇది సుఖ జీవనంచేస్తున్న వాడికి ఎప్పుడైనా సంభవించవచ్చు.

నేడు మన దేశంలో వందలాది ప్రముఖ వ్యక్తులకు ఈ విపరీత బుద్ధి పుట్టి వివేకాన్ని నాశనం చేసి, వేగంగా వాళ్ళ దుర్బుద్ధిలో పుట్టిన కార్యక్రమాన్ని అమలు జరిపించి, వాళ్ళను సర్వనాశనం చేస్తున్నది. వీరు అవినీతి, ధనాశ, దురాశ, పేరాశ, అనే ఆశాపిశాచగ్రస్తులై దీనిని వదిలించే మాంత్రికుడు దొరకక, జీవితాలలో తిరిగి లేచి నించునే అవకాశాలు లేక నాశనమయినారు. ఈ ధనాశా పిశాచగ్రస్తులైనవారు అందరూ ధనం లేని పేదలు కారు. దరిద్రం వంటి కష్టాలలో ఉన్నవారు కారు. అందరూ ధనవంతులే. వాళ్ళ దురదృష్టం వాళ్ళలో అవివేకాన్ని సృష్టించి, తప్పుచేయడానికి కావలసిన అవకాశాలు కల్పించి, ధనరాశులను ఎరగా చూపించింది. వాళ్ళ విధి వాళ్ళను నాశనం చేసింది.

దేశవ్యాప్తంగా, ఢిల్లీ నుండి కర్ణాటక దాకా ఇదే అంతులేని కథ దేశంలో బొగ్గు సరఫరానుంచి మన సేనలకు ట్రక్కులు కొనుక్కోవడం దాకా ఎన్నో ఎన్నో కథలు. ఇదంతా యావద్భారతానికి అపకీర్తి పతాకం. ఈ వ్యక్తులు పెద్దస్థాయికి కొన్ని దశాబ్దులు పరిశ్రమతో ఎదిగినవారు. విధి కొండ చివరిదాకా తీసుకెళ్ళి ఆ శిఖరంనుంచి పడేస్తుంది. అప్పటికి కాని ఆ దుష్టశక్తికి తృప్తికలుగదు. మొత్తం దేశంలో వెయ్యిమంది అవినీతితో జైళ్ళపాలైతే నష్టం ఎవరికి? వాళ్ళ వ్యక్తిగత జీవితాలు సర్వనాశనం కావడం ఎలాగూ తప్పదు. వెయ్యి మంది జీవితాలైతే మాత్రం దేశానికి ఏమి లోటు? ఒక వ్యక్తి పది వేల కోట్లు సంగ్రహించాడనుకోండి. దాని ఫలితంగా వాళ్ళ నాశనం తప్పడంలేదు. ఆ ధనం యొక్క నష్టం ఇంత పెద్ద భారతదేశానికి హాని చేసేటంత ఆర్థిక నష్టం కానేకాదు. లక్ష కోట్లు దొంగిలించినా భారతదేశానికి దరిద్రం వస్తుందా? రానేరాదు. ఒక్కమాటు దేశవ్యాప్తంగా వందలాది వ్యక్తులు మూకుమ్మడిగా తస్కరించిన ధనంవల్ల దేశానికి తీవ్రమైన నష్టం జరుగలేదు. కాని ఇంత పెద్ద దేశానికి ప్రపంచ దేశాల మధ్య కీర్తి నష్టమవుతుంది.

బ్రిటన్, అమెరికా వంటి దేశాలలో మనస్థాయిలో కరప్షన్ అనే మాట ఉండనే ఉండదు. ఎప్పుడైనా ఒక కేసు జరుగవచ్చు. నిత్యకృత్యంలో, ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాజీవనం వీటిమధ్య అటువంటి అవినీతి ఉండదు. పెద్ద పదవుల్లో ఉన్నవాళ్ళు అవినీతితో మనదేశంలోవలె అపార ధనం సంపాదించడం జరుగదు. అటువంటి దేశాలున్న ఈ ప్రపంచంలో భారతదేశం సంపాదించుకున్నవి అపకీర్తి, గౌరవహాని. ఇది విదేశాలలో భారతీయులకు తలవంపు. అంతర్జాతీయ దేశాలలో భారతదేశానికి గొప్ప నష్టదాయకం.

విదేశాలనుంచి లక్షల కోట్ల పెట్టుబడితో వ్యాపారపు ఒప్పందాలు ఎన్నో ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకుంటాయి. రెండు సంవత్సరాల తరువాత ఒప్పందంలో భారతీయుల అవినీతి బయటపడుతుంది. ఒప్పందం భారత ప్రభుత్వం రద్దుచేస్తుంది. అట్లాంటి ఒప్పందాలకు, దేశంలో పల జరిగిన వాటికి కూడా అదే గతి. చాలా పెద్దఎత్తున వ్యాపార ప్రణాళికలు రూపొందుతాయి. ప్రభుత్వం మంజూరుచేస్తుంది. ఒప్పందం కుదుర్చుకుంటుంది. వేల ఎకరాల భూమి ఇచ్చేస్తుంది. పెద్ద వ్యాపారస్తులు పెట్టుబడి పెట్టేస్తారు. ఆ సంస్థ పని ప్రారంభిస్తుంది. చాలా ధనమూ, కాలమూ వ్యయమవుతాయి. ఉన్నట్టుండి బయటపడ్డ అవినీతి ఒక్క క్షణంలో ఆ కార్యక్రమాన్ని చంపేస్తుంది. ఇచ్చిన భూములు ప్రభుత్వం వెనుకకు లాక్కుంటుంది.

మన రాష్ట్రంలో 26 జీవోలు ఒక్క దెబ్బన రద్దుచేశారు. ఇది అవినీతిని నిర్మూలించే విధానమా? ఇందులో ఎన్నో వందల మంది ఉద్యోగులూ, పెట్టుబడులూ నష్టపోవచ్చు. ఇది ప్రజాసంక్షోభం కాదా? కేంద్ర ప్రభుత్వం 2జి, 3జి పేర్లతో మంజూరుచేసిన లక్షల కోట్ల విలువలు కలిగిన ప్రణాళికలు, వ్యాపార ఒప్పందాలు హఠాత్తుగా రద్దుచేసి ఎంతమందిని నష్టపెట్టాయి? 230 ఒప్పందాలు రద్దు అయినాయి. మనవాళ్ళకు లంచమిచ్చిన విదేశీయులు భారతీయ విధానాలమీద నమ్మకం పోగొట్టుకున్నారు. దేశానికి విదేశీయుల నమ్మకం నష్టమైనది. ఇలా నష్టపోయిన విదేశీ వ్యాపారస్తులు కాని, మన దేశస్తులు కాని ఎందుకు ప్రతిఘటించడం లేదు? వాళ్ళవి లంచం ఇచ్చిన చేతులు కాబట్టి! ఇది మన భారతదేశ పరిపాలనావ్యవస్థకు తీరని మచ్చ.

దేశంలో ప్రజలకు ప్రభుత్వంమీద పూర్తిగా నమ్మకంపోయింది. ఏ పెద్ద ప్రణాళికా అమలుఅయ్యేదాకా నమ్మకం లేదు. నేటి భారతదేశంలో నీతిమీద నమ్మకం లేనివాడు ప్రభుత్వంలో ఎంతో ఉన్నత స్థాయికి సులభంగా వెళ్ళే అవకాశం దేశంలో సమృద్ధిగా ఉంది. అదీ మన రాజకీయ వ్యవస్థ. ప్రభుత్వాల నిర్మాణంలో ఉండే పద్ధతుల్లోనే తీవ్రమైన లోపాలు ఉన్నయన్నమాట!

మన రాష్ట్రం విషయం ఒక్కమాటు పరిశీలిద్దాము. ఒక ముఖ్యమంత్రి, ఒక పార్టీ, అనేక మంది యంత్రాంగం, ఉన్నతోద్యోగులు, అనేక మంది మంత్రులు అందరూ కలిసి అవినీతి పాల్పయ్యారని, ఎన్నో తప్పులు గల నిర్ణయాలు తీసుకున్నారని, ప్రభుత్వ అనుమతులు ఇవ్వబడ్డాయని అంతా అవినీతిమయంగా కథ నడిచిందని, ఈ కథంతా ప్రజల ముందుకు వచ్చింది. ముఖ్యమంత్రితో మొదలుపెట్టి, మంత్రి మండలి, ఉన్నతాధికారులు అందరూకలిసి చేసిన తప్పు ఎవరో కొందరు వ్యక్తులు చేశారని చెప్పడం తప్పు. అన్ని తప్పులూ రాష్ట్ర ప్రభుత్వం చేసిందనే చెప్పాలి. ప్రభుత్వం నీతిమాలిన పని చేసిందని అంటే, వ్యక్తుల శిక్షతో సరిపోతుందా? వ్యక్తుల అవినీతికీ, మొత్తం ప్రభుత్వమే చేసిన పనికీ వ్యత్యాసం ఉంది. అలాంటప్పుడు, ఈ తప్పులన్నీ బయటపడగానే, వంద మందిని ఒకరి తరువాత ఒకరిని వ్యక్తిగతంగా శిక్షించడం కంటే, ఆధికారికంగా, తాత్కాలికంగా ప్రభుత్వాన్ని రద్దుచేసి, ఏ రాష్ట్రపతి పాలననో విధించి, అసెంబ్లీని నిలుపుచేసి, ఈ తప్పులన్నీ సరిదిద్ది, వీలైనంత మందిని ఉద్యోగాలనుంచి తొలగించి, ఇళ్ళకు పంపించి, అన్ని జీవోలను సవరించి, ప్రజాహిత కార్యక్రమాలను రద్దుచేయకుండా క్రమబద్ధీకరించి ఒక క్రొత్త వ్యవస్థను సృష్టిస్తే ఎలా ఉండేదో? అలా చేసి ఉంటే, తప్పులన్నీ సవరించమని పోలీసువారి చేతుల్లో పెట్టకుండా ఒక రాజకీయ ప్రణాళికగా జరిగి ఉంటే, నేడు జరుగుతున్న సవరింపులు హింసా రహితంగా ఉండేవేమో! ఇంతాచేసి పోలీసు మార్గంలో అవినీతిని నిర్మూలన చేద్దామనుకుంటే అప్పుడుకూడా దానికి ఎంతో ప్రతిఘటన వస్తుంది. దీనిని ప్రతిఘటించేవారికి ప్రజలలో సానుభూతిపరులూ ఉండవచ్చు. మద్దతుదారులు ఉండవచ్చు. సమాజము విభక్తమవుతుంది. ఇదంతా సామాజిక సంక్షోభమే!

ముఖ్యమంత్రితో మొదలుపెట్టి, మంత్రి మండలి, ఉన్నతాధికారులు అందరూకలిసి చేసిన తప్పు ఎవరో కొందరు వ్యక్తులు చేశారని చెప్పడం తప్పు. అన్ని తప్పులూ రాష్ట్ర ప్రభుత్వం చేసిందనే చెప్పాలి. ప్రభుత్వం నీతిమాలిన పని చేసిందని అంటే, వ్యక్తుల శిక్షతో సరిపోతుందా? వ్యక్తుల అవినీతికీ, మొత్తం ప్రభుత్వమే చేసిన పనికీ వ్యత్యాసం ఉంది. అలాంటప్పుడు, ఈ తప్పులన్నీ బయటపడగానే, వంద మందిని ఒకరి తరువాత ఒకరిని వ్యక్తిగతంగా శిక్షించడం కంటే, ఆధికారికంగా, తాత్కాలికంగా ప్రభుత్వాన్ని రద్దుచేసి, ఏ రాష్ట్రపతి పాలననో విధించి, అసెంబ్లీని నిలుపు చేసి, ఈ తప్పులన్నీ సరిదిద్ది, వీలైనంత మందిని ఉద్యోగాలనుంచి తొలగించి, ఇళ్ళకు పంపించి, అన్ని జీవోలను సవరించి, ప్రజాహిత కార్యక్రమాలను రద్దుచేయకుండా క్రమబద్ధీకరించి ఒక క్రొత్త వ్యవస్థను సృష్టిస్తే ఎలా ఉండేదో?

ఇంత పెద్ద పరిమాణంలో జరిగిన రాజకీయ అవినీతిని, సరిదిద్దే అవకాశం రాజకీయ విధానంలో తప్పక దొరకగలదు. పోలీసు, దర్యాప్తు, కేసు, కోర్టు, ఇవన్నీ మన క్లిష్టమైన విధానాలతో శిక్షకు దారితీయవచ్చు. శిక్షలుపడకపోవచ్చును కూడా. ఇలా కాకుండా నేరస్థులందరూ నేరాన్ని ఒప్పుకొని, అధికారం వదులుకొని, అక్రమాస్తులను ప్రభుత్వాలకప్పగించి, స్వయంగా వెళ్ళిపోయే ట్లు చేయడం ఎలాగన్నది ఆలోచించాలి. అల్లాగే, లక్ష చేసే ఎకరం, పదివేలకు పభుత్వం ఎవరికైనా ఇస్తే, దాని నిజమైన విలువ వసూలుచేసే అవకాశం ఉండాలి.

పెద్దలందరూ ఆలోచిస్తే ఒక నాగరికమైన విధానంగా ఒక ప్రభుత్వాన్ని సంస్కరించే విధానం మన రాజకీయ వ్యవస్థలో తప్పకుండా దొరకగలదు. జపాన్ వంటి దేశాలలో ఇటువంటి విధానాలు అవలంబించిన సంఘటనలు ఉన్నాయి. నేరం ఒప్పుకోవడం, అవినీతి ధనాన్ని ప్రభుత్వానికి స్వయంగా అప్పగించడం అసాధ్యమైన విషయం కాదు.

ఇప్పుడు మాత్రం దేశాన్ని మొత్తంగా బాగుచేసేది పోలీసు వ్యవస్థయే అని మనం నమ్ముతున్నట్లు కనబడుతుంది. అది చాలా కాలయాపన, హింస, అనిశ్చిత ఫలితాలతో కూడుకున్నది. నేరానికి శిక్ష మాత్రమేకాక, వ్యక్తి సంస్కరించబడటం, అప్పుడు శిక్షించబడటం, క్షమించబడటమూ మన నాగరికతలో భాగమే.

చివరి మాట. మనుష్యుడు ఎప్పుడూ వివేకాన్ని కోల్పోకూడదు. తనకు అవసరమేలేని ధనము, అలాగే అవినీతి మార్గంలో ఒక స్త్రీగాని, అధికారం గాని కంటబడటం ఇవన్నీ మనిషిని వివేకహీనుణ్ణి చేసి ఆపదలపాలు చేసే దుష్టశక్తులు. దేశంలో అందరికీ వివేకం కలగాలంటే, మనం నమ్ముకున్న ఈశ్వరుడే దయచేయాలి. మరో మార్గం కనబడదు. మన దేశంలో అతి వైభవంగా జరుగుతున్న వందలాది మతపరమైన ఉత్సవాలు ఇలాంటి ఫలితాలతో మనకివ్వాలని ఆశిద్దాము. శివో రక్షతు.

**- సద్గురు శివానందమూర్తి**